నాలా మరమ్మతులు త్వరగా చేపట్టండి



మన్సూరాబాద్ చౌరస్తా సమీపంలో డ్రైనేజీ పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ నర్సింహారెడ్డి

మన్సూరాబాద్: డ్రైనేజీ నాలా మరమ్మతు పనులు వేగవంతం చేయాలని మన్సూరాబాద్ కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి అధికారులను కోరారు. డివిజన్ పరిధి మన్సూరాబాద్ చౌరస్తా సమీపంలోని ఆయిల్ మిల్ వద్ద కొనసాగుతున్న డ్రైనేజీ మరమ్మతు పనులను గురువారం కార్పొరేటర్ పరిశీలించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ, గత కొన్ని రోజులుగా డ్రైనేజీ పొంగి రోడ్లపై పారుతోందని, మరమ్మతు పనులు నత్తనడకన చేపడుతుండంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. వరద కాలువల్లోని సిల్ట్‌ను తొలగించకపోవడంతో డ్రైనేజీ మురుగు రోడ్లపై పారుతోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. సుమారు 300 కాలనీల మురుగు ఈ నాలా గుండా పారుతుందని, వర్షాకాలాన్ని దృష్టిలో పెట్టుకుని నాలాలోని సిల్ట్‌ను వెంటనే తీయించాలని అధికాలను కోరారు.

కాలనీ సమస్యలు పరిష్కరించండి..

డివిజన్ పరిధిలో కొత్తగా ఎన్నికైన కాస్మోపాలిటన్ కాలనీ సంక్షేమ సంఘం ప్రతినిధులు గురువారం కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి కాలనీలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు రుద్ర లక్ష్మీనర్సింహ, ప్రధాన కార్యదర్శి గిరిజాల శ్రీకాంత్, యుగంధర్ రెడ్డి, వనం భాస్కర్, జగదీష్‌యాదవ్, గంజి సత్తయ్య తదితరులు ఉన్నారు.

అన్నమయ్య కీర్తనలు అమోఘం

నాగోలు: అన్నమయ్య రచించిన కీర్తనలు ఎన్ని దశాబ్దాలైనా పాడుకోవచ్చని, ఆయన కీర్తనలు అమోఘమని న్యూ నాగోలు సీనియర్ సిటిజన్స్ ఫోరమ్ అధ్యక్షుడు డాక్టర్ /జ్ఞానకుమార్ అన్నారు. అన్నమయ్య జయంతి సందర్భంగా గురువారం ఫోరమ్ ఆధ్వర్యంలో అన్నమయ్య సంకీర్తనల కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జ్ఞానకుమార్ మాట్లాడుతూ.. వాగ్గేయకారుడు అన్నమయ్య కీర్తనలు పండితులు, పామరులంతా పాడుకోవచ్చని అన్నారు. గాయని రుక్మిణి మాట్లాడుతూ, అన్నమయ్య కీర్తనలు ఎంతో మధురమని, ఏ తరానికైనా గుర్తుండి పోతాయన్నారు. ఈ సందర్భంగా గాయనీ గాయకులు విజయలక్ష్మి, శైలజ, హిరన్ బాల, బాల హను, జ్ఞానకుమార్‌లు అన్నమయ్య



అన్నమయ్య కీర్తనలు ఆలపిస్తున్న గాయనీ గాయకులు

కీర్తనలను ఎంతో శ్రావ్యంగా ఆలపించి ప్రేక్షకులను అలరించారు. కార్యక్రమంలో డాక్టర్ శ్యామల తదితరులు పాల్గొన్నారు.

యిర్మియాకు సోషల్ సర్వీస్ అవార్డు



యిర్మియాకు అవార్డు అందజేస్తున్న బిషప్ డాక్టర్ ఆనంద్‌కుమార్

మలక్‌పేట: మలక్‌పేట చర్చ్ ఆఫ్ క్రైస్ట్ మినిస్ట్రీ నిర్వాహకుడు, పాస్టర్ రెవరెండ్ కూనదొడ్డి యిర్మియాకు డాక్టర్ ఆఫ్ సోషల్ సర్వీస్ అవార్డు లభించింది. క్రైస్తవ సమాజానికి అందించిన సేవలను గుర్తించి హోలీ స్పిరిట్ క్రిస్టియన్ యూనివర్సిటీ (యూఎస్ఏ- థియోలాజికల్ యూనివర్సిటీ అనుబంధం) ప్రతినిధులు గురువారం సికింద్రాబాద్‌లో జరిగిన కార్యక్రమంలో హెచ్ఎస్‌సీసీ ప్రెసిడెంట్ బిషప్ డాక్టర్ ఆనంద్‌కుమార్ చేతుల మీదుగా యిర్మియాకు అవార్డు అందజేశారు. అవార్డు తన బాధ్యతను మరింత పెంచిందని, క్రైస్తవుల సమస్యల పరిష్కారానికి, వారి శ్రేయస్సు కోసం తన శక్తిమేర కృషి చేస్తానని యిర్మియా అన్నారు. కార్యక్రమంలో వైస్ ప్రెసిడెంట్ డాక్టర్ ప్రేమానందం, బిషప్ జి.సామ్యేల్ జాన్, ఆర్చ్ బిషప్ ఎంఎస్ దయానంద్, బిషప్ గోనె ఫిలిప్, బిషప్ యేసురత్నం పాల్గొన్నారు.

కాలువ కబ్జాను అడ్డుకున్న అధికారులు

హయత్‌నగర్: కాలువను మట్టితో పూడ్చి కబ్జా చేసేందుకు అక్రమార్కులు చేసిన ప్రయత్నాన్ని ఇరిగేషన్, రెవెన్యూ అధికారులు అడ్డుకుని ఆక్రమణలను తొలగించారు. హయత్‌నగర్ డివిజన్‌లో గురువారం జరిగిన ఈ ఘటన వివరాలు రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ నర్సింహ యాదవ్ కథనం ప్రకారం... హయత్‌నగర్ డివిజన్ ఇంజాపూర్ నుంచి హయత్‌నగర్ బాతుల చెరువులోకి వరదనీరు వచ్చే రాస కాలువను ఇంజాపూర్ వెళ్లే దారిలో కొందరు మట్టితో పూడ్చేశారు. రాత్రికి రాత్రి ప్రహరీ నిర్మాణం చేపట్టారు. ఈ విషయం తెలుసుకున్న జీహెచ్ఎంసీ లేక్ విభాగం ఏఈ నాగరాజు, టౌన్ ప్లానింగ్ అధికారి సత్తిరెడ్డి ఘటనా స్థలానికి చేరుకొని డోజర్ సహాయంతో తొలగించారు. ఇంజాపూర్ నుంచి హయత్‌నగర్ బాతుల చెరువు వరకు 33 అడుగుల వెడల్పుతో ఈ కాలువ ఉంటుందని, గ్రామ నక్ష ప్రకారం కాలువకు హద్దులు ఏర్పాటు చేస్తామని అధికారులు తెలిపారు. కాలువను కబ్జా చేస్తే సహించేది లేదని, కాలువపై ఎలాంటి నిర్మాణాలు చేపట్టినా చర్యలు తీసుకుంటామని అధికారులు హెచ్చరించారు.

అపార్ట్‌మెంట్ పై నుంచి దూకి వృద్ధురాలి ఆత్మహత్య

చైతన్యపురి: అనారోగ్యంతో బాధపడుతున్న ఓ వృద్ధురాలు అపార్ట్‌మెంట్‌పై నుంచి దూకి ఆత్మహత్య చేసుకున్న ఘటన చైతన్యపురి పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. ఇన్‌స్పెక్టర్ సైదిరెడ్డి కథనం ప్రకారం.. న్యూ మారుతీనగర్‌లోని మారుతీ హైట్స్ అపార్ట్‌మెంట్‌లో నివాసం ఉండే మహేశ్ తల్లి శశికళ (69) కొంతకాలంగా ఆస్తమాతో బాధపడుతోంది. ఆస్పత్రిలో చికిత్స చేయించుకున్నప్పటికీ ఆరోగ్యం కుదుటపడలేదు. వాకింగ్ చేసేందుకని శశికళ గురువారం అపార్ట్‌మెంట్ టెర్రస్‌పైకి వెళ్లింది. కళ్లద్దాలు, పర్సు, చెప్పులు పక్కన పెట్టి అక్కడి నుంచి కిందికి



శశికళ (ఫైల్)

దూకేసింది. గమనించిన వాచ్‌మన్ విషయాన్ని మహేశ్‌కు చెప్పడంతో వెళ్లి చూశాడు. తలకు తీవ్రగాయాలు కావడంతో అప్పటికే శశికళ మృతి చెందింది. పోలీసులకు ఫిర్యాదు చేయగా మృతదేహాన్ని పోస్టుమార్టానికి తరలించి కేసు నమోదు చేశారు. అనారోగ్యం వల్ల మనస్తాపానికి గురై ఆత్మహత్య చేసుకున్నట్టు భావిస్తున్నారు.



శారదానగర్ కాలనీ చివరిలో నిలిచిన వరద కాలువ నిర్మాణం



ప్రస్తుతం కాలువ నిర్మించాల్సిన స్థలం

ఏటేటా అదే తంతు..!



ఎగువన ఉన్న గడ్డిపొలాల నుంచి కాలనీలోకి వస్తున్న మురుగు నీరు

- వరద ముంపు బారిన శారదానగర్
- తాత్కాలిక ఉపశమన చర్యలతో సరి
- శాశ్వత నివారణ చర్యలకు కాలనీవాసుల వినతి

వనస్థలిపురం: ప్రతీ సంవత్సరం అదే తంతు.. వర్షాకాలం వస్తున్నదంటే ఆ కాలనీవాసుల్లో ఆందోళన మొదలవుతుంది. ఎగువన ఉన్న కాలనీలు, గడ్డిపొలాల నుంచి వచ్చే మురుగు నీటికి తోడు వరద నీరు చేరి కాలనీని ముంచెత్తుతోంది. ప్రతియేడు ఇదే గోస పడుతున్నా పాలకులు, అధికారులు తాత్కాలిక ఉపశమన చర్యలు తప్ప శాశ్వత నివారణ చర్యలు చేపట్టడం లేదని కాలనీవాసులు వాపోతున్నారు. గత కొన్నేళ్లుగా వనస్థలిపురం శారదానగర్ కాలనీవాసులు పడుతున్న అవస్థ ఇదీ..

◆ హయత్‌నగర్ డివిజన్ పరిధిలో 1500 ఇళ్లతో శారదానగర్ కాలనీ అతిపెద్ద కాలనీ. కాలనీ ఫేజ్–3 (మోహినీ ఎన్‌క్లేవ్)లో 200 లకు పైగా ఇళ్లు ఉంటాయి. కాగా కాలనీకి ఎగువన ఉన్న సాహెబ్‌నగర్, పద్మావతి కాలనీ, పీవీఆర్ కాలనీ, సామనగర్, ఆంధ్రకేసరినగర్, కమలానగర్, భూలక్ష్మీనగర్, సుభద్రానగర్ తదితర కాలనీల నుంచి వచ్చే మురుగు నీరు, వరదనీరు శారదానగర్ ఫేజ్–3 మీదుగానే హయత్‌నగర్ కుమ్మరికుంట, బాతుల చెరువు ప్రాంతాలకు వెళ్లాల్సి ఉంటుంది. వరద కాలువలు, డ్రైనేజీ వ్యవస్థ సరిగా లేకపోవడంతో ఎగువనుంచి వచ్చే మురుగు, వరదనీరు శారదానగర్‌ను ముంచెత్తుతోంది. వర్షాలు కురిస్తే ఖాళీ స్థలాలు మొత్తం కుంటలుగా మారుతున్నాయి.

నిధులు మంజూరైనా...

శారదానగర్ నుంచి దిగువన ఉన్న నర్సింహారావునగర్ వరకు వరద కాలువ నిర్మాణం కోసం జీహెచ్ఎంసీ నుంచి నిధులు మంజూరైనా పనులు ప్రారంభం కాలేదు. టెండర్లు పిలిచి వర్క్ ఆర్డర్ ఇచ్చినా కాంట్రాక్టర్ పనులు చేపట్టలేదని కాలనీవాసులు తెలిపారు. వరద కాలువ నిర్మాణం జరిగే దారిలో ఉన్న భూయజమానులు అడ్డుకుంటుండటంతో పనులు ముందుకు సాగడం లేదని వారు ఆరోపిస్తున్నారు.

టీడీఆర్‌కు అంగీకరించినా...

శారదానగర్ సమీపంలో ఉన్న భూమి యజమానులు తమ భూమి లోంచి పైప్‌లైన్ వేయడానికి సహకరించడం లేదని స్థానికులు చెప్తున్నారు. స్థానిక కార్పొరేటర్ కళ్లెం నవజీవన్‌రెడ్డి, మున్సిపల్ అధికారులు వారితో చర్చించి వారు కోరుకున్న విధంగా టీడీఆర్ (ట్రాన్స్‌ఫర్ ఆఫ్ డెవలప్‌మెంట్ రైట్స్)మంజూరుకు అంగీకరించినా సదరు వ్యక్తులు సంబంధిత పత్రాలను సమర్పించకపోవడంతో పనుల్లో పురోగతి లేదన్నారు.

ఎమ్మెల్యే చొరవ తీసుకోవాలి



వర్షాకాలంలో శారదానగర్, మోహినీ ఎన్‌క్లేవ్ చాలా ఏళ్లుగా వరద ముంపునకు గురవుతున్నాయి. వరద కాలువ నిర్మాణం పనులు కొంతవరకు పూర్తయినా శారదానగర్ దిగువన ఉన్న స్థలం యజమానులు సహకరించక పోవడంతో పనులు నిలచిపోయాయి. వారు అనుమతి ఇస్తే పనులు చేపడతామని అధికారులంటున్నారు. వర్షాకాలం వస్తున్నందున ఈ విషయంలో ఎమ్మెల్యే, అధికారులు చొరవ తీసుకుని వరద కాలువ నిర్మాణం పూర్తయ్యేలా చూడాలి.

– కేఎల్ నర్సింహారావు, ప్రధాన కార్యదర్శి, శారదానగర్

ఘనంగా బుద్ధ జయంతి



నాగోలు: ఎల్‌బీనగర్‌లోని వాసవి శ్రీనిలయంలో గురువారం బుద్ధ జయంతిని ఘనం నిర్వాహించారు. ఈ సందర్భంగా బుద్ధుని విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకులు శంకర్, బీపంగి, నర్సింహ ప్రసాద్, అలివేలు మంగమ్మ, భారత్ రెడ్డి, రవీందర్‌రెడ్డి, పరమేశ్వరి పాల్గొన్నారు.

వ్యాన్ ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి మృతి

నాగోలు: రోడ్డు ప్రమాదంలో గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందిన ఘటన ఎల్‌బీనగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో గురువారం జరిగింది. ఎల్‌బీనగర్ పోలీసుల కథనం ప్రకారం... గురువారం ఉదయం 7 గంటల సమయంలో ఎల్‌బీనగర్ శ్రీకర ఆస్పత్రి నుంచి సాగర్ రింగ్ రోడ్డుకు వెళ్లే దారిలో రోడ్డు దాడుతున్న గుర్తు తెలియని వ్యక్తి (65)ను ఎల్‌బీనగర్ నుంచి టీకేఆర్ కాలేజీ కమాన్ వైపు వెళ్తున్న డీసీఎం వ్యాన్ ఢీ కొట్టింది. తలపై నుంచి వ్యాన్ చక్రాలు వెళ్లడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. ఎల్‌బీనగర్ పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. ఘటనా స్థలంలో మృతుడికి సంబంధించిన ఎలాంటి ఆధారాలు లభించలేదని, తెల్లచొక్కా, తెల్ల పంచె ధరించి ఉన్నాడని పోలీసులు తెలిపారు. పోలీసులు వ్యాన్ డ్రైవర్‌పై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

గుంతలమయంగా మూసారంబాగ్ రోడ్లు



గుంతలు పడ్డ ఫ్రెండ్స్ కాలనీ రోడ్డు

ప్రమాదాలకు గురవుతున్న వాహనదారులు

మలక్‌పేట: మూసారంబాగ్‌లో రోడ్లు అధ్వానంగా మారుతున్నాయి. డ్రైనేజీ లీకేజీలతో బీటీ లేచిపోతున్నది. దీనికి తోడు ఇటీవల కురిసిన వర్షాలకు రోడ్లు గుంతలు పడి వాహనదారులకు చుక్కలు చూపిస్తున్నాయి. మూసారంబాగ్ డివిజన్ పరిధిలోని ఆరోరా కాలేజీ నుంచి శాలివాహన నగర్‌కు వెళ్లే దారిలో తరచూ లీకేజీతో డ్రైనేజీ నీరు పారుతుండటంతో అద్దంలా ఉన్న రోడ్డు గుంతలమయంగా మారుతోంది. మరమ్మతులు చేపట్టినా సమస్య పునరావృతం అవుతోంది. లక్షలు పోసి నిర్మించిన రోడ్లకు అధికారుల సత్వరం మరమ్మతులు చేపట్టకపోవడంతో పూర్తిగా ధ్వంసమైపోతున్నాయి. అంబర్‌పేట నుంచి శాలివాహననగర్ మీదుగా.., దిల్‌సుఖ్‌నగర్, చైతన్యపురి మీదుగా నాగోల్ వైపు నిత్యం వందల సంఖ్యలో వాహనాలు ఇదే దారిలో ప్రయాణం సాగిస్తుంటాయి. పాడైన రోడ్ల మూలంగా వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. అధికారులు సమన్వయంతో పని చేసి రోడ్డుకు మరమ్మతులు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

'సహారా'లో ఎన్నికల కోలాహలం



నామినేషన్లు వేస్తున్న వెంకటాద్రి ప్యానల్ అధ్యక్ష అభ్యర్థి సయ్యద్‌జానీ, ప్యానల్ సభ్యులు



శ్రీకాంత్ ప్యానల్ అధ్యక్ష అభ్యర్థి కరణం శ్రీకాంత్, ప్యానల్ సభ్యులు

మన్సూరాబాద్: డివిజన్ పరిధిలోని సహారా స్టేట్స్‌కాలనీ మెయింటనెన్స్ కమిటీ ఎన్నికల కోలహలం మొదలైంది. కాలనీ క్లబ్ హౌస్‌లో బుధవారం నామినేషన్ల పర్వం ప్రారంభం కాగా.. గురువారం ప్రధాన ప్యానళ్ల సభ్యులు బ్యాండ్‌మేళాలతో అట్టహాసంగా వచ్చి నామినేషన్లు దాఖలు చేశారు. జూన్2న జరిగే పోలింగ్‌లో శ్రీకాంత్ ప్యానల్, వెంకటాద్రి ప్యానల్ ప్రధానంగా పోటీ పడుతున్నారు. శ్రీకాంత్ ప్యానల్ నుంచి కరణం శ్రీకాంత్ అధ్యక్షుడిగా, జ్ఞానేశ్వర్‌రావు ప్రధాన కార్యదర్శిగా పోటీ పడుతుండగా, వెంకటాద్రి ప్యానల్ నుంచి అధ్యక్షుడిగా సయ్యద్ జానీ, ప్రధాన కార్యదర్శిగా సుదర్శన్‌రెడ్డి పోటీలో ఉన్నారు. మొత్తం 1170 ఓటర్లు ఉండగా, వీరిలో 1002 మంది ఎన్నికల్లో ఓటేసేందుకు అర్హత పొందారని ఎన్నికల అధికారులుగా వ్యవహరిస్తున్న నరేందర్‌రెడ్డి, నర్సింహారెడ్డి, గంగదాసు కృష్ణారెడ్డి, సాయిరాం, సుధాకర్ తెలిపారు. ఇరు ప్యానళ్ల నుంచి గురువారం సాయంత్రానికి 40 మంది నామినేషన్లు దాఖలయ్యాయన్నారు. జూన్ 2 ఉదయం పోలింగ్, సాయంత్రం కౌటింగ్ నిర్వహించి విజేతలను ప్రకటిస్తామన్నారు.

శ్రీచైతన్య కళాశాలను సీజ్ చేయాలి: ఏఐవైఎఫ్

నాగోలు: ఇంటర్ బోర్డు నిబంధనలను ఉల్లంఘించి అక్రమంగా వేసవి తరగతులు నిర్వహిస్తున్న ఎల్‌బీనగర్, అల్కాపురిలోని శ్రీ చైతన్య కళాశాలను సీజ్ చేసి, కఠిన చర్యలు తీసుకోవాలని అఖిల భారత యువజన సమాఖ్య (ఏఐవైఎఫ్) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కల్లూరు ధర్మేంద్ర డిమాండ్ ప్రభుత్వాన్ని చేశారు. గురువారం ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో సదరు కళాశాల వద్ద తరగతులను బహిష్కరించి, ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ధర్మేంద్ర మాట్లాడుతూ, ధనార్జనే ధ్యేయంగా విద్యార్థులను, వారి తల్లిదండ్రులను మోసం చేస్తూ అనధికారికంగా శ్రీచైతన్య జూనియర్ కళాశాలను నడిపిస్తున్నారని మండిపడ్డారు. లక్షలాది రూపాయలు ఫీజుల రూపంలో వసూలు చేస్తున్న కళాశాల యాజమాన్యం విద్యార్థులకు మౌలిక సదుపాయాలు కల్పించడంలో విఫలమైందని ఆరోపించారు. హాస్టల్ నిర్వహణకు అనుమతి లేకున్నా.. నిర్లక్ష్యంగా అమ్మాయిలకు, అబ్బాయిలకు ఒకే రూమ్‌లో తరగతులు నిర్వహిస్తున్నారని ఆరోపించారు. ఇంటర్ బోర్డు తక్షణమే కార్పొరేట్ కళాశాలల ఆగడాలను అడ్డుకోవాలని డిమాండ్ చేశారు. ఏఐవైఎఫ్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ నెర్లకంటి శ్రీకాంత్, ఉపాధ్యక్షుడు సత్యప్రసాద్, మాజీద్, నరేష్, కిరణ్ పాల్గొన్నారు.

డ్రైనేజీ పనుల్లో జాప్యంతో అగచాట్లు

- పనులపై కాంట్రాక్టర్ల నిర్లక్ష్యం
- పట్టించుకోని అధికారులు
- రాకపోకలకు కాలనీవాసుల అవస్థలు

నాగోలు: కొత్తపేట డివిజన్ పరిధిలోని కాలనీల్లో నూతన డ్రైనేజీ పైపులైన్ నిర్మాణ పనుల్లో జాప్యం కారణంగా ఆయా కాలనీల ప్రజలు నానా అవస్థలు పడుతున్నారు. జలమండలి అధికారులు పర్యవేక్షణ కొరవడంతో కాంట్రాక్టర్లు పనులపై నిర్లక్ష్యం చేస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఒకపక్క నూతన డ్రైనేజీ పైప్‌లైన్ కోసం గతంలో ఉన్న డ్రైనేజీ పైప్‌లను బయటకు తీసి అక్కడే వేయడం, మరోపక్క నూతన పైప్‌లైన్ కోసం తవ్వి పనులు పూర్తి కాకపోవడంతో కాలనీవాసులు ఇళ్ల నుంచి బయటకు రాలేని పరిస్థితి నెలకొంది.

◆ కొత్తపేట డివిజన్‌లో భరత్‌నగర్ కాలనీ, శివమ్మనగర్, రాజీవ్‌గాంధీనగర్‌లో నాలుగు నెలల క్రితం నూతన డ్రైనేజీ పనులు చేపట్టారు. పైప్‌లైన్ కోసం తవ్వకాలు చేసి మట్టిని, పాత పైప్‌లను అక్కడ వదిలేశారు. జలమండలి అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో పనులు చేపట్టి నాలుగు నెలలైనా పూర్తి చేయకుండా కాంట్రాక్టర్లు కాలయాపన చేస్తున్నారు. కొన్నిచోట్ల పనులు ముగిసినా గుంతలను పూడ్చకపోవడంతో స్థానికులు నానా అవస్థలు పడుతున్నారు.



భరత్‌నగర్‌లో డ్రైనేజీ కోసం తవ్వి వదిలేసిన దృశ్యం

◆ భరత్‌నగర్ కాలనీలో పనులు పూర్తి కాకపోవడంతో ఇంటి నుంచి బయటకు, బయట నుంచి ఇంట్లోకి వెళ్లలేని పరిస్థితి ఏర్పడిందని ఆ కాలనీవాసులు తెలిపారు. ఈ విషయంపై జలమండలి అధికారులకు ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా స్పందించడం లేదని వారు వాపోతున్నారు. ఇప్పటికైనా జలమండలి ఉన్నతాధికారులు, ప్రజా ప్రతినిధులు స్పందించి కొత్తపేట డివిజన్‌లోని భరత్‌నగర్ కాలనీ, శివమ్మనగర్, రాజీవ్‌గాంధీనగర్‌లో డ్రైనేజీ పైప్‌లైన్ పనులు త్వరగా పూర్తి చేయించాలని స్థానికులు కోరుతున్నారు.



రాజీవ్‌గాంధీనగర్ నత్తనడకన సాగుతున్న డ్రైనేజీ పనులు

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు



సైదాబాద్: చెట్లకొమ్మల తొలగింపు, పలు మరమ్మతు పనుల కారణంగా ఆస్మాన్‌ఘడ్ ట్రాన్స్‌కో డివిజన్ పరిధిలో ఈ కింద తెలిపిన ప్రాంతాల్లో శుక్రవారం విద్యుత్ సరఫరా ఉండదని డీఈ హన్మంత్‌రెడ్డి తెలిపారు.

ఉ. 11 నుంచి మ. 12 గంటల వరకు...
ఆస్మాన్‌ఘడ్, వెంకటాద్రి నగర్, గడ్డిఅన్నారం, ఆర్‌బీ కాలనీ పరిసర ప్రాంతాలు.

మ. ఒంటి గంట నుంచి 2 గంటల వరకు...
వెంకటాద్రి నగర్, ఆస్మాన్‌ఘడ్, ఎస్‌బీహెచ్, భూలక్ష్మీనగర్ పరిసర ప్రాంతాలు.

మ. 3:30 నుంచి సా. 5 గంటల వరకు...
సీ క్వార్టర్స్, ముంతాజ్ కాలేజ్ క్రాస్‌రోడ్, హనుమాన్ టెంపుల్ పరిసర ప్రాంతాలు.

చంపాపేట: ఉ. 11 నుంచి మ. 12.30 గంటల వరకు.. కర్మన్‌ఘాట్ పరిధిలోని సామ సరస్వతి, క్రాంతినగర్, న్యూ మారుతీనగర్, కర్మన్‌ఘాట్ పాతబస్తీ, లక్ష్మీనగర్, ఉదయ్‌నగర్, బాలాజీ నగర్, గ్రీన్‌పార్కు, శ్రీనిధి, హనుమాన్‌నగర్, ఆంప్రో కాలనీలకు సరఫరా నిలిపివేస్తామని ట్రాన్స్‌కో ఏఈ విజయ్‌కుమార్ తెలిపారు.

పార్కింగ్ లొల్లి..

- అంబులెన్స్ డ్రైవర్లు, న్యూ మల్టీ కార్స్ సిబ్బంది పరస్పరం దాడులు
- ఇరువర్గాల ఫిర్యాదుతో కేసుల నమోదు

నాగోలు: పార్కింగ్ విషయంపై అంబులెన్స్ డ్రైవర్లు, న్యూ మల్టీ కార్స్ సిబ్బంది పరస్పరం దాడులు చేసుకున్నారు. ఇరు వర్గాలపై ఎల్బీనగర్ పోలీసులు కేసులు నమోదు చేశారు. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. కామినేని ఫ్లైఓవర్ కింద ఆర్టీసీ కాలనీ వైపు ప్రైవేట్ అంబులెన్స్ వాహనాలను నిలిపి ఉంచుతున్నారు. అక్కడ రోడ్డు పక్కనే ప్రీ ఓన్డ్ కార్లు విక్రయించే న్యూ మల్టీ కార్స్ కేంద్రం ఉంది. బుధవారం సాయంత్రం న్యూ మల్టీ కార్స్ వారు ఓ కారును అంబులెన్స్ పార్కింగ్ పక్కన రోడ్డుపై నిలిపి ఉంచారు. అంబులెన్స్ వెళ్లడానికి ఇబ్బంది కలుగుతోందని కారును తొలగించాలని న్యూ మల్టీ కార్స్ వారితో గొడవకు దిగారు. మాటా మాటా పెరిగి కర్రలు రాడ్లతో ఇరు వర్గాల వారు కొట్టుకున్నారు. సమీపంలో విధులు నిర్వహిస్తున్న ట్రాఫిక్ పోలీసులు వారిని సమాధానపర్చి దాడుల్లో గాయపడిన ముగ్గురిని ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. ఘటనా స్థలానికి చేరుకున్న ఎల్బీనగర్ పోలీసులు ఇరు వర్గాల వారిని స్టేషన్‌కు తరలించారు. ఇరు వర్గాలు పరస్పరం పోలీసులకు ఫిర్యాదు చేయగా, కేసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

చెరువులోని వ్యర్థాలను ఎప్పటికప్పుడు తొలగించాలి

చైతన్యపురి: సరూర్‌నగర్ చెరువు నీటిలోని వ్యర్థాలను ఎప్పటికప్పుడు తొలగించాని గడ్డిఅన్నారం కార్పొరేటర్ బద్దం ప్రేమ్‌మహేశ్వర్ రెడ్డి అధికారులను కోరారు. సరూర్‌నగర్ సర్కిల్ ఎంటమాలజీ సిబ్బంది ఆధ్వర్యంలో చేపట్టిన చెరువు నీటి వ్యర్థాల తొలగింపు పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ, చెరువు సమీప కాలనీల ప్రజలు, చిరువ్యాపారులు చెత్తను చెరువులో వేయడంతో పేరుకుపోతున్నదని అన్నారు. చెరువు చుట్టూ జాలీ ఏర్పాటు చేసి చెత్త వేయకుండా కట్టడి చేయాలని ఎంటమాలజీ అధికారులకు సూచించారు. చెరువు నీటిలో చెత్త పేరుకుపోవటం వల్ల దోమలు వృద్ధి చెంది లోతట్టు కాలనీల ప్రజలు ఇబ్బంది పడుతున్నారన్నారు. చెరువు సుందరీకరణకు నిధులు మంజూరు చేసి పనులు ప్రారంభించాలని కోరారు. కార్యక్రమంలో పీ అండ్ టీ కాలనీ అధ్యక్షుడు అశోక్, గడ్డి అన్నారం కాలనీ అధ్యక్షుడు రఘు, బీజేపీ నాయకులు చిలుకూరు రాంరెడ్డి, రఘునందన్, జోషి, గిరీష్, శశాంక్‌నాయుడు, టింకు పాల్గొన్నారు.

ప్రత్యంగిరా దేవిని దర్శించుకున్న బలగం వేణు

దిల్‌సుఖ్‌నగర్: ఆర్‌కేపురంలోని కుర్తాళం పీఠం శ్రీ ప్రత్యంగిరా పరమేశ్వరి అమ్మవారిని బలగం సినిమా దర్శకుడు, నటుడు వేణు దంపతులు గురువారం దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా వేణు మాట్లాడుతూ, ప్రత్యంగిరా అమ్మవారు చాలా శక్తిగల దేవత అని, అమ్మవారి మహిమలు ప్రపంచమంతటా వ్యాప్తి చెందాయని అన్నారు. ఆలయ సెక్రెటరీ మునిపల్లె శ్రీనివాస్ సువర్ణలత దంపతులు వేణుకు అమ్మవారి జ్ఞాపికను, ప్రసాదాన్ని అందజేశారు. విఠల్ శర్మ, అరుణ, సాయికుమార్ శర్మ, బనగిరి నాగరాజు, హేమంత్, శ్రీపతి, రామశర్మ పాల్గొన్నారు.

ఇంటి నంబర్‌కు రూ.10 వేల డిమాండ్

ఏసీబీకి పట్టుబడ్డ ట్యాక్స్ ఇన్‌స్పెక్టర్



ఏసీబీకి పట్టుబడ్డ సాయి భార్గవ్

మన్సూరాబాద్: ఇంటి నంబర్ కేటాయించి, ట్యాక్స్ అసెస్‌మెంట్ చేయడానికి రూ.10 వేలు లంచం తీసుకుంటూ ఎల్‌బీనగర్ సర్కిల్ ట్యాక్స్ ఇన్‌స్పెక్టర్ సాయి భార్గవ్ అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) అధికారులకు పట్టుబడ్డాడు. రంగారెడ్డి జిల్లా ఏసీబీ డీఎస్పీ ఆనంద్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. కర్మన్‌ఘాట్‌లో నిర్మాణం పూర్తైన ఓ ఇంటికి నంబర్‌తో పాటు ట్యాక్స్ అసెస్‌మెంట్ కోసం నిర్మాణదారుడు ఆన్‌లైన్‌లో ఎల్‌బీనగర్ సర్కిల్ కార్యాలయానికి దరఖాస్తు చేసుకున్నాడు. నిబంధనల ప్రకారం ఫీజులు చెల్లించినప్పటికీ ఇంటి నంబర్ కేటాయించి, ట్యాక్స్ అసెస్‌మెంట్ చేయడంలో ట్యాక్స్ ఇన్‌స్పెక్టర్ సాయి భార్గవ్ జాప్యం చేశాడు. ఈ విషయాన్ని ఇంటి నిర్మాణదారుడు తన మిత్రుడైన రిటైర్డ్ అసిస్టెంట్ మున్సిపల్ కమిషనర్ నర్సింహారెడ్డికి చెప్పాడు. ఇద్దరూ కలిసి సదరు ట్యాక్స్ ఇన్‌స్పెక్టర్‌ను సంప్రదించగా రూ.10 వేలు డిమాండ్ చేశాడు. తాను జీహెచ్ఎంసీ రిటైర్డ్ ఉద్యోగినని చెప్పినప్పటికీ డబ్బులు ఇవ్వాల్సిందేనని సాయి భార్గవ్ పట్టుబట్టాడు. దీంతో నర్సింహారెడ్డి ఏసీబీ అధికారులకు ఫిర్యాదు చేశాడు. గురువారం సాయంత్రం 6.30 గంటల ప్రాంతంలో ఎల్‌బీనగర్ సర్కిల్ కార్యాలయంలో నర్సింహారెడ్డి నుంచి సాయి భార్గవ్ రూ.10 వేలు తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. అతడిని అదుపులోకి తీసుకొని విచారిస్తున్నారు.

రాజేష్‌కు పురస్కారం

దిల్‌సుఖ్‌నగర్: హైదరాబాద్‌కు చెందిన మాతృదేవోభవ- పితృదేవోభవ సంస్థ ఐదవ వార్షికోత్సవం సందర్భంగా నగరంలో గురువారం నిర్వహించిన ఓ కార్యక్రమంలో వివిధ రంగాల్లో విశేష సేవ చేస్తున్న వారిని సన్మానించారు. ఈ సందర్భంగా అనాథ విద్యార్థులకు అందిస్తున్న సేవలకుగాను ఆర్‌కేపురం చిత్రలేవుట్ కాలనీలోని అనాథ విద్యార్థి గృహం అధ్యక్షుడు మార్గం రాజేష్‌కు మహానీయుల పురస్కారం–2024 అవార్డును ఇండియన్ రెవెన్యూ సర్వీసెస్ అసిస్టెంట్ కమిషనర్ సందీప్ భాగా చేతుల మీదుగా అందజేశారు. డాక్టర్ సంపత్ కుమార్, డాక్టర్ కోక భిక్షం తదితరులు పాల్గొన్నారు.